క్లుప్తంగా

ఉచిత కంటి ఆపరేషన్లకు 34 మంది ఎంపిక


కళ్ల పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 34 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన 60 మందికి కంటి జబ్బు పరీక్షలు చేసి, అందులో 34 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


గుడిపాల: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడిపాల: కంటి పరీక్షలు ప్రతి ఒక్కరికీ చాలా అవసరమని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. సోమవారం సీఎస్ఆర్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కంటిచూపు లోపం ఉంటే ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కువ దృష్టి లోపం సమస్య ఉంటే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి మెరుగైన పరీక్షల కోసం పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మంజువాణి, విజయ, సెల్వి, చంద్ర, ఉమ, సుజిమ, కరస్పాండెంట్ లోకేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ సీతారాంను గుడుపల్లె తహసీల్దార్‌గా నియమించారు. తిరుపతి జిల్లాల నుంచి విచ్చేసిన లోకేశ్వరిని చిత్తూరు రూరల్‌కు, నంద్యాల జిల్లా నుంచి విచ్చేసిన మురళీమోహన్‌ను పెద్దపంజాణి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వినతుల మానిటరింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించాలన్నారు. నంద్యాల జిల్లా నుంచి విచ్చేసిన గుడుపల్లి తహసీల్దార్‌గా నియమించి డిప్యూటేషన్‌లో కుప్పం ఆర్డీఓ కార్యాలయం ఏఓగా విధులు నిర్వహించాలన్నారు. గుడుపల్లె తహసీల్దార్ రామాంజులు నాయక్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొగిలీశ్వరాలయంలో రాహుకేతు పూజలు


మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మొగిలీశ్వర స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ


నగరంలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీవిగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అదేవిధంగా తల్లి పేరు మీద మొక్క నాటాలని కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో రాయలసీమ జోనల్, ఎస్సీ మోర్చా సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యతిథిగా ఆ పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, నాయకులు శ్రీనివాసులు, దాము, షణ్ముగం పాల్గొన్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

- 16 నుంచి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు
- అధికారుల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులకు రెవెన్యూ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 45 రోజుల పాటు జిల్లాలో ఏ గ్రామంలో ఏ తేదీల్లో సదస్సులు నిర్వహించాలనే ప్రణాళికను సిద్ధం చేసి కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్‌లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని చెప్పారు. సదస్సుల్లో రెవెన్యూ రికార్డులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి తహసీల్దార్ ప్రాథమికంగా తమ పరిధిలో ఏ గ్రామంలో ఎక్కువ రెవెన్యూ సమస్యలు వస్తాయనే నిర్ధారణకు వచ్చేందుకు గత ఆరు నెలల అర్జీలు పరిశీలించాలని సూచించారు.

ప్రత్యేక దృష్టితో పనిచేయాలి

రెవెన్యూ సదస్సుల నిర్వహణలో తహసీల్దార్లు ప్రత్యేక దృష్టితో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా సదస్సుల్లో మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖల అధికారులు పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌తో పాటు ఆర్డీఓలు సదస్సులను పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. పెద్ద డివిజన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఏ సమస్యకైనా నిర్ణీత గడువులోపు పరిశీలిస్తామని నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆగస్టు 15న లాంఛనంగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 లోపు డిజిటలైజేషన్

అన్ని సహకార సంఘాల సంఘాలు అక్టోబర్ 2 లోపు డిజిటలైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓ, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఈకేవైసీ నమోదును రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీసీఈఓ సీఈఓ మనోహర్ గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారి నాగవర్ధిని, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాలకు దరఖాస్తులు


మాట్లాడుతున్న మోహన్‌బాబు

గుడిపాల: రైతుల వద్ద సూక్ష్మ, తుంపర సేద్యం పరికరాలకు సంబంధించి దరఖాస్తులు చేయించాలని గుడిపాల మండల నోడల్ ఆఫీసర్ మోహన్‌బాబు తెలిపారు. సోమవారం గుడిపాల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఎకరాలు, అంతకంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీ, 5 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న వారికి 70 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతోపాటు పండ్లు, కూరగాయల తోటల్లో కూడా డ్రిప్ పరికరాలకు రైతుల వద్ద నుంచి రిజిస్ట్రేషన్లు చేయించాలని సూచించారు. గుడిపాల మండలంలో 800 హెక్టార్లలో రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ మాధవి పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల్లో టీడీపీ నేతల జోరు


కౌండిన్య నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్

- కౌండిన్య నదిలో రెవెన్యూ, పోలీస్ శాఖ దాడులు
- జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్
- తహసీల్దార్ కార్యాలయానికి తరలింపు
- అధికారులతో టీడీపీ నేతల మంతనాలు
- జరిమానా లేకుండా వాహనాలను తీసుకెళ్లిన టీడీపీ నేతలు!


ఇసుక తవ్వకాలకు వినియోగించిన జేసీబీని సీజ్ చేసిన అధికారులు

గంగవరం: తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమంగా ఇసుక తోడుతున్న రెండు జేసీబీలు, ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గంగవరం పోలీసులు సోమవారం మధ్యాహ్నం సీజ్ చేశారు. వివరాలు..ఎలాంటి అనుమతులు లేకుండా కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి మండలంలోని తమ్మిరెడ్డిపల్లె వద్ద కౌండిన్య నదిలో దాడులు చేశారు. ఇసుక తవ్వుతున్న వాహనాలను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అప్పటికి సమయం సాయంత్రం 4 గంటలైంది. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. వాహనాలకు ఎలాంటి జరిమానాలు లేకుండా వాటిని తీసుకెళ్లేందుకు రెవెన్యూ అధికారులతో టీడీపీ నేతలు మంతనాలు సాగించారు. సీన్ కట్ చేస్తే- సీజ్ చేసిన వాహనాలను ఎలాంటి జరిమానా విధించకుండా సాయంత్రం 6 గంటలకు వదిలేశారు. ఇది చర్చనీయాంశమైంది. వాస్తవానికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా విధించాల్సి ఉంది.

ఘనంగా పచ్చయమ్మన్ కల్యాణోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం దొడ్డిపల్లిలోని శ్రీమన్నారుస్వామి సమేత పచ్చయమ్మన్ ఆలయంలో సోమవారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి


బంగారుపాళెం: శిక్షణా కార్యక్రమంలో సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శివశంకర్

బంగారుపాళెం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికతోనే సాధ్యమని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలసి పని చేసినప్పుడే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి వచ్చే వివిధ గ్రాంట్‌లను అభివృద్ధి పనులకు ఉపయోగించుకునే విధానం, పంచాయతీరాజ్ కార్యాచరణ ప్రణాళిక-2024-25, పారిశుద్ధ్య నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఓ వరం.. ఫ్యామిలీ డాక్టర్


ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్


పల్లెచెరువులో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: మారుమూల ప్రాంత నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఓ వరం అని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్య సేవలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పల్లెచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించాలని సూచించారు. వర్షాకాలంలో జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గుడిపాలలో..


గోవిందరెడ్డిపల్లెలో..

ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యమే మహాభాగ్యమని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 37 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. వృద్ధాప్యంలో ఆహార నియమాలు పాటించాలన్నారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు గర్భిణులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: 197 రామాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అనూష 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వచ్చే ఫిర్యాదులు, వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉన్న వాటిని ప్రాధాన్యత క్రమంగా, మిగిలిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఇంజినీరింగ్, టిడ్కో, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, మెప్మా విభాగాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, రెవెన్యూ అధికారి వర్మ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరణలో నాయకులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం సాయంత్రం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్ష, కార్యదర్శి మొగిలయ్య, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం 1974లో యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయులు తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కౌన్సిలర్ సాంబశివన్, జిల్లా కార్యదర్శి సరిత, మండల కోశాధికారి మహేష్‌బాబు, పలువురు యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్ లైన్ ఏర్పాటు చేయండి


రైల్వే అధికారి శ్రీనివాస మల్లాదికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: కాట్పాడి వయా చిత్తూరు పాకాల మీదుగా తిరుపతికి డబుల్‌లైన్ ఏర్పాటు చేయాలని చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ సమీపంలోని సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సెక్రటరీ శ్రీనివాస మల్లాదిని కలిసి విన్నవించారు. ఈ లైన్ కోసం రూ.1528 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ఢిల్లీలోని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. వీటిపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవ చూపితే సమస్య వేగంగా పరిష్కారమవుతుందని సొసైటీ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు సత్య, అశోక్ పాల్గొన్నారు.

ఐరాల ఎంపీడీఓగా నాగరాజు



ఐరాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఇక్కడికి ఎంపీడీఓగా వచ్చిన వెంకటేశు సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ నాగరాజును ఉన్నతాధికారులు ఐరాలకు నియమించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తవణంపల్లె ఎంపీడీఓకు వీడ్కోలు


వెంకటేశ్వర్లుకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇటీవల ప్రభుత్వం వీరిని వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు రిలీవ్ కాగా ఆయనకు ఏఓ. రెడ్డిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

చెడు వ్యసనాలతో జీవితం దుర్భరం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. సోమవారం ఆ కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాసా ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో పొగాకు, మాదకద్రవ్యాల నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు లోనై జీవితం బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక దుష్పరిణామాలు ఉంటాయన్నారు. మత్తుకు బానిసలుగా మారితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలపై కలిగే అనర్థాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్


ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏఐఎస్ఎఫ్) సంఘం ఎల్లప్పుడూ విద్యార్థుల వైపే నిలుస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని ఎస్సీ బాలురు కళాశాల వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ సంఘం ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల పక్షాన పోరాటాలు చేస్తోందన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో సంఘం ఏర్పాటైందని, వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తోందని తెలిపారు. తమ సంఘం 88 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఇదే పోరాట స్ఫూర్తితో విద్యను వ్యాపారం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టేందుకు ఏఐఎస్ఎఫ్ సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యం అయ్యే కుట్రలను తిప్పి కొట్టే విధంగా పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చైతన్య, సాయిరాం రెడ్డి, రెడ్డి ప్రసాద్, జయరాం, చక్రవర్తి, సాంబశివ, మణిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేద్దాం


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నుంచి పూతలపట్టు పురవీధుల్లో 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ జాతీయ భావాలను పెంపొందించేందుకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేపట్టారని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న జాతీయ నాయకుల విశిష్టతను విద్యార్థులు గ్రామాల్లో వివరించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.